నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం 01 మార్చి 2025
తెలంగాణ ప్రాంతీయం
పేజీలు 8



## రోడ్డు ప్రమాదంలో..

# భార్యాభర్తలు మృతి

**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** సంచార జీవనం సాగిస్తూ రంజాన్ పండుగకు సొంతూరికి వెళ్తున్న బార్యాభర్తలను లారీ రూపంలో మృత్యువు కబలించింది. ఈ విషాదకర సంఘటన ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్ర సమీపంలో చోటు చేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో బుధరావుపేట గ్రామానికి చెందిన మహబూబ్‌పాషా, అతని బార్య సైనాలు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....ఉమ్మడి వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన మహాబూబ్ పాషా, సైనా దంపతులు సంచారజీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రంజాన్ పండుగ సమీపిస్తుండటంతో తమ స్వగ్రామమైన బుధరావుపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మల్లంపల్లి నర్సంపేట ప్రధాన రహదారిపై దేవనగరం క్రాస్ రోడ్ వద్ద నర్సంపేట వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీట్టింది.ఈ ప్రమాదంలో బార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఆస్పత్రికి తరలించారు.





## మంజూరు ఒకచోట...

# నిర్వహణ మరోచోట

- మండల కేంద్రాల్లో నిర్వహించని గురుకుల పాఠశాలలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 80 శాతం అద్దె భవనాలలో కొనసాగుతున్న గురుకులాలు..

**కోదాడ, ఫిబ్రవరి 27(నినాదం న్యూస్):** ఆధునికతకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం గురుకులాలు ప్రవేశపెట్టింది. బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సొసైటీల పరిధిలో వీటిని ఏర్పాటు చేసింది. నాణ్యమైన విద్యనందిస్తూ మొదట్లో గురుకులాలు ఓ వెలుగు వెలిగాయి. కాలక్రమేణా వసతుల కరవు ఏర్పడటంతో నాణ్యమైన విద్య అందడంలేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలు ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలు మండల కేంద్రాల్లో లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రాల పేరుతో గురు కులాలు మంజూరై మరోచోట అది కూడా అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రభుత్వం మండల కేంద్రాల కు గురుకులాలు మంజూరు చేసినా క్షేత్ర స్థాయిలో మిగతా2లో

## ఎస్ఎల్‌బీసీ ఘటనపై..

# సీఎం బాధ్యతారాహిత్యం

- మాజీ మంత్రి హరీశ్‌రావు



వివరాలు 2లో

## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

# భర్త హత్యకు ప్లాన్..

- అడ్డంగా దొరికిన డాక్టర్ భార్య..
- వివాహేతర బంధం కోసం బరితెగింపు
- ప్రియుడు శామ్యూల్, సహకరించిన ఏఆర్ కానిస్టేబుల్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్

వివరాలు 2లో



# మంజూరు ఒకచోట... నిర్వహణ మరోచోట

**(మొదటిపేజీ తరువాయి..)**

మాత్రం మండల కేంద్రాల్లో నిర్వహించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక మండలానికి మంజూరైన గురుకుల పాఠశాల ఇంకో మండలంలో కొనసాగిం చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏ మండలానికి మంజూరైన గురుకుల పాఠశాలలను అయా మండలకేంద్రాల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతు న్నారు.

**అద్దె భవనాలలోనే కొనసాగింపు..**

జిల్లాలో 80 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటిని ప్రభుత్వం జూనియర్ కళాశాలలుగా అప్గ్రేడ్ చేసుకుంటూ వస్తోంది. అద్దె భవనాల్లో తరగతి గదులు చిన్నగా ఉండటంతో విద్యార్థులు సరిగ్గా కూర్చునే వీలు లేదు. ఆట స్థలాలు లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు. చాలా చోట్ల సరిపడా నీటి సౌకర్యం కూడా లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మిషన్ భగీర నీరు రాకపోవడంతో ప్రైవేటులో మంచి నీళ్లు కొనుక్కునే దుస్థితి. ప్రభుత్వం ఇచ్చే నిధులు మౌలిక వసతులకు సరిపోవడం లేదని సిబ్బంది చెబుతున్నారు. అద్దె భవనాల కిరాయికి అయ్యే ఖర్చుతో సొంత భవనాలు నిర్మించవచ్చునని పేర్కొంటున్నారు. వసతి గృహాల్లోనూ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అవి కూడా చాలా వరకు అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో సాగుతున్నాయి. దీంతో ఇటు తరగతి గదిలో, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు...ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా బీసీ గురుకులాలు 31 ఎస్సీ గురుకులాలు 29, మైనార్టీ గురుకులాలు 12 ఎస్టి గురుకులాలు 19 ఉన్నాయి.

**ప్రయాణం దూర భారం.**

కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి మండలానికి కేటాయించిన బీసీ గురుకుల పాఠశాలను చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. అనంతగిరి నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హుజూర్నగర్లో ఏర్పాటు చేయాల్సిన ఎస్సీ గురుకుల పాఠశాలను కూడా ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు. మునగాల మండలంలో ఏర్పాటు చేయాల్సిన పాఠశాలను కోదాడ మండలంలో ఏర్పాటు చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా మంజూరు ఒక దగ్గర, భవనాలు మరో చోట ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు..

# ఎస్ఎల్బీసీ ఘటనపై.. సీఎం బాధ్యతారాహిత్యం

- సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం
- ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ.... ప్రాణాల మీద లేదు
- హెలికాప్టర్ షోలకే సీఎం పరిమితం
- మాజీ మంత్రి హరీశ్రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నినాదం న్యూస్):** ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్రావు మండిపడ్డారు. ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు.  వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు. సొరంగం లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారని ఆదేవన వ్యక్తం చేశారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని హరీశ్రావు ప్రశ్నించారు. కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు.తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్రావు మండిపడ్డారు.

# అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్యకు ప్లాన్..

- అడ్డంగా దొరికిన డాక్టర్ భార్య..
- వివాహేతర బంధం కోసం బరితెగింపు
- ప్రియుడు శామ్యూల్, సహకరించిన ఏఆర్ కానిస్టేబుల్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 27 (నినాదం న్యూస్):** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తనే చంపించేందుకు ప్లాన్ వేసింది భార్య. ఇటీవల వరంగల్ వైద్యుడిపై హత్యాయత్నం కేసును మిల్స్ కాలనీ పోలీసులు ఛేదించారు. డాక్టర్ భార్యే ప్రధాన సూత్రధారిగా తేల్చారు. నిందితురాలు గాదె ఫ్లోరా మరియా (వరంగల్), ఆమె ప్రియుడు ఏర్రోల్ల శామ్యూల్ (సంగారెడ్డి), వీరికి సహకరించిన ఏఆర్ కానిస్టేబుల్ మంచుకురి రాజ్ కుమార్ (సంగారెడ్డి)ని గురువారం  అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈమేరకు వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ కేసు వివరాలను వెల్లడించారు. వరంగల్ కు చెందిన డాక్టర్ సుమంత్ రెడ్డికి ఫ్లోరా మరియాతో 2016 లో ప్రేమ వివాహం జరిగింది. 2018లో సంగారెడ్డిలో సుమంత్ రెడ్డి బంధువుల విద్యాసంస్థలు ఉండగా వాటిని చూసుకోవడానికి అతని భార్య ఫ్లోరా మరియా, డాక్టర్ సుమంత్ రెడ్డి సంగారెడ్డికి షిఫ్ట్ అయ్యారు. అక్కడ డాక్టర్ సుమంత్ రెడ్డి సంగారెడ్డి పీహెచ్ సీలో కాంట్రాక్టు పద్ధతిన మెడికల్ ఆఫీసర్ గా పనిచేస్తుండగా, ఫ్లోరా స్కూల్లో టీచర్ గా పని చేస్తోంది.

**జిమ్ సెంటర్లో పరిచయం....**

ఫ్లోరా బరువు తగ్గడానికి సంగారెడ్డిలోని సిద్ధు జిమ్ సెంటర్ కి వెళ్తుండేది. జిమ్ సెంటర్లో కోచ్ గా పని చేస్తున్న ఏర్రోల్ల శామ్యూల్ పరిచయమయ్యాడు. పరిచయం కాస్తా వివాహేతర బంధంగా మారింది. ఈ విషయం సుమంత్ రెడ్డికి తెలియడంతో కుటుంబలో గొడవలు మొదలయ్యాయి. దీంతో డాక్టర్ సుమంత్ రెడ్డి ఫ్యామిలీతో వరంగల్ కు మకాం మార్చారు. 2019లో ఫ్లోరా మరియా లెక్చరర్ ఉద్యోగం సాధించి జనగామ జిల్లాలోని పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కాలేజీలో విధులు నిర్వహిస్తూ అక్కడే ఉండేవారు. తర్వాత కాలేజీ వరంగల్ లోని రంగశాయిపేటకు మారడంతో డాక్టర్ సుమంత్ రెడ్డి వరంగల్ ని వాసవి కాలనీలో ఉంటూ కాజీపేటలో ప్రైవేట్ హాస్పిటల్ నడుపుకుంటూ ఉదయం వెళ్లి రాత్రి తన ఇంటికి వస్తుండేవాడు.

**శ్యామూల్కు టచ్లో ఫ్లోరా..**

ఫ్లోరా మరియా సంగారెడ్డిలో పరిచయమై శామ్యూల్ తో తరచుగా ఫోన్ లో మాట్లాడడం వీడియో కాల్స్ మాట్లాడడం డాక్టర్ సుమంత్ రెడ్డి లేని సమయంలో అతడిని ఇంటికి పిలిపించుకునేది. ఇది తెలుసుకున్న డాక్టర్ సుమంత్ రెడ్డి ఆమెను మందలించేవారు. ఈ విషయంలో వారిద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో ఫ్లోరా మరియా, శామ్యూల్ డాక్టర్ ను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. శామ్యూల్ ఈ విషయాన్ని స్నేహితుడైన ఏఆర్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ కు చెప్పాడు. డాక్టర్ సుమంత్ రెడ్డి హత్యకి సహకరిస్తే సంగారెడ్డిలో ఇల్లు కట్టిస్తానని చెప్పగా హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ ఒప్పుకొన్నాడు.

**ముందుగా లక్ష రూపాయలు..**

ఫ్లోరా మరియా 15 రోజుల క్రితం లక్ష రూపాయలను శామ్యూల్ కి పంపింది. అందులో నుంచి ఖర్చులకు రూ. 50 వేలు శామ్యూల్ తీసుకోని, మిగిలిన 50 వేలను ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ కు ఇచ్చాడు. ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం సంగారెడ్డిలో సుత్తిని కొనుగోలు చేసి రాజకుమార్ రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ పై బయలుదేరి కాజీపేటకు వచ్చి ముందుగా వారు అనుకున్న ప్రకారం డాక్టర్ సుమంత్ రెడ్డిని హత్యచేసేందుకు సీసీ కెమెరాలు, జనసంచారం లేని చీకటి ప్రదేశాన్ని ఎంచుకున్నారు. సుమంత్ రెడ్డి రాత్రి తన క్లినిక్ ముగించుకొని కారులో బట్టుపల్లి రోడ్డు నుంచి రంగాశాయపేట వెళ్తున్న క్రమంలో వెనుకే వచ్చిన శామ్యూల్, రాజ్ కుమార్ డాక్టర్ సుమంత్ రెడ్డి కారును ఆపి విచక్షణారహితంగా కొట్టి గాయపర్చారు. చనిపోయాడని భావించి అక్కడి నుంచి వారు పారిపోయారు. డాక్టర్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఈ కేసును వరంగల్ ఏసీపీ నంది రామ్ ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం దర్యాప్తు చేసి ప్రత్యక బృందాలుగా ఏర్పడి నిందితులను అరెస్ట్ చేశారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు





- మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణలు
- పరిస్థితిని సమీక్షించిన పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

**మంచిర్యాల, ఫిబ్రవరి 27 (నినాదం న్యూస్):** తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్  ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్ళాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు.స్థానిక ఎస్ఐ కాంగ్రెస్కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానిక బీజేపీ నేత కమలాకరరావు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్ఐ బీజేపీ నేతపై దాడి చేశారంటూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీజేపీ శ్రేణులపై దూసుకువచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య పరస్పరం వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఒక నొక దశలో పరిస్థితి చేజారి ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కను 69,134 మంది పట్ట భద్రులు, 5,693 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగింది. ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఇక్కడ పురుష ఓటర్లు కీలకంగా ఉన్నాయి. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్

- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- కాంగ్రెస్ బీజేపీల మధ్య ప్రధాన పోటీ





సైలెంట్ ఓటింగ్ ప్రసన్న హరికృష్ణ కే
జమ్మికుంట, ఫిబ్రవరి 27 (నినాదం న్యూస్) పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. హుజరాబాద్ నియోజకవర్గం లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా పట్టబద్రులు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇకపోతే ఉదయం కొంచెం మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం రెండు గంటల వరకు పుంజుకున్నది. ఓటింగ్ సరళిని బట్టి కాంగ్రెస్ బిజెపి బీఎస్పీ పార్టీల నాయకులు గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేశారు.

**వార్ వన్ సైడే గెలుపు మాదే....**
**- బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు...**

పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు దాదాపు ఖరారు అయిందని మా గెలుపును ఎవరు ఆపలేరని పట్టబద్రులు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా బిజెపి అభ్యర్థులకు వేశారని ఆయన తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు డబ్బులు పంపిణీ చేసిన ఫలితం లేదని వార్ వన్ సైడే అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. చైతన్యవంతులైన పట్టభద్రుడు తమ నిర్ణయాన్ని ఓటు ద్వారా బిజెపి అభ్యర్థులకు ఓటు వేసి తమ మద్దతు ప్రకటించారని మార్చి మూడు న వచ్చే రిజల్టు కూడా ఈ విధంగానే ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే పట్టభద్రుల కు ఓటు వేసే విధానాన్ని వివరిస్తూ వారికి సహాయంగా బిజెపి నాయకులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు జమ్మికుంట మాజీ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ మండలాధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ మహిళా నేతలు గర్రెపల్లి నిరురాణి రమారెడ్డి మాజీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లెపు రవి కొండ్లె నాగేష్ యాంసాని సమ్మయ్య సుంకర యాదయ్య దొడ్డ వేణు తదితరులు పాల్గొన్నారు.

**భారీ మెజార్టీ తో నరేందర్ రెడ్డి గెలుపు ఖాయం.... కాంగ్రెస్ నేతలు.**

ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా బరిలో ఉన్న నరేందర్ రెడ్డి గెలుపు ఖాయం అయిపోయిందని పట్టబద్రులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి నరేందర్ రెడ్డి కి పట్టం కట్టనున్నారని వారు తెలిపారు. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా పట్టబద్రులకు ఓటు వేసే విధానాన్ని వివరిస్తూ వారికి సహాయ సహకారాలు అందించిన స్థానిక కాంగ్రెస్ నేతలు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రణవ్ బాబు సూచనలతో విస్తృత ప్రచారం నిర్వహించి పట్టభద్రులకు అవగాహన కల్పించామని ప్రజలు ప్రభుత్వాన్ని నమ్మినారని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు పట్టబద్రులు విశ్వాసం చూపిస్తూ మంచి భవిష్యత్తు ఉండాలంటే కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలని సంకల్పంతో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కి పట్టం కట్టడానికి సిద్ధమై తమ అమూల్యమైన ఓటును నరేందర్ రెడ్డి కి వేశారని గెలుపు ఖాయం అయిపోయిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు ఎండి ఇమ్రాన్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వ్యాపారాలపై చట్టపరమైన చర్యలు తప్పవు

**- ఎస్సై సతీష్ గౌడ్**



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 27(నినాదం న్యూస్) :** అక్రమ ఇసుక రవాణాపై పోలీస్ అధికారులు కొరడా జులిపిస్తున్న కూడా కొందరి వ్యవహారం మారడం లేదు.. మరిపెడ ఎస్సై సతీష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం చింతల గడ్డ తండా వాసి అంగోత్ రవీందర్ ఇసుకను ఆక్రమ రవాణా చేస్తుండగా ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సులోభ మార్గంలో అతి తక్కువ కాలంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం నీలికుర్తి గ్రామపంచాయతీ శివారు దాస్య తండకు చెందిన బానోత్ లాలు, గుగులోత్ వీరన్న,చిల్లంచర్ల గ్రామ శివారు చందా తండకు చెందిన అజ్మీరా నరేష్ ముగ్గురి నుండి 1.5 క్వింటాల నల్లబెల్లం,2.30 కేజీల పట్టిక స్వాధీనం చేసుకుని,200 లీటర్ల పానకం ధ్వంసం చేయడం జరిగింది.. వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు...

# కోదాడ డివిజన్‌లో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



**కోదాడ ,ఫిబ్రవరి 27 (నినాదం న్యూస్):** కోదాడ డివిజన్ లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం నాలుగు గంటల వరకు మొత్తం పోలింగ్ 95.22 శాతం నమోదయింది. డివిజన్ వ్యాప్తంగా 712 ఓటర్లు ఉండగా 678 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 420 మంది పురుషులు కాగా మహిళలు 258 మంది ఉన్నారు. డివిజన్లో మండలాల వారీగా కోదాడ 472 ఓటర్లు ఉండగా 457, నడిగూడెం 48 ఉండగా 44 , మునగాల 65 ఉండగా 56, చిలుకూరు 102 ఉండగా 97, అనంతగిరి 25 ఉండగా 24 ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఓటింగ్

**- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 96.15శాతం, పట్టభద్రుల 82.83శాతం**



**మహాముత్తారం ఫిబ్రవరి27, ( నినాదం న్యూస్):** అదిలాబాద్ కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 26 ఓటర్లు ఉండగా 25 ఓటర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీకి 367 ఓటర్లు ఉండగా 304 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 96.15, పట్టభద్రుల ఎమ్మెల్సీకి 82.83 పర్సంటే ఇలా ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దండు శ్రీనివాస్ వివరించారు. ఎలాంటి ఆటంకాలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎస్సై మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు ఇబ్బంది పెట్టకుండ

# హాల్‌టికెట్లు ఇవ్వాలి



**చౌటుప్పల్,ఫిబ్రవరి 27(నినాదంన్యూస్):** ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా వారికి హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాల ఫీజులు కడితేనే ఇంటర్ హల్‌టికెట్లు ఇస్తామని కళాశాలలు యాజమాన్యాలు చెప్పడంతో విద్యార్థులు మానసిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. హల్‌టికెట్లు వస్తాయా రావా అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పెండిరగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# దాల్చిన చెక్క నీళ్లను మహిళలు రోజూ తాగాలి



దాల్చిన చెక్కను మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. ఎక్కువగా మసాలా వంటలను చేసినప్పుడు దాల్చిన చెక్కను కూడా ఉపయోగిస్తుంటారు. దాల్చిన చెక్కను వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. దాల్చిన చెక్కను మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. ఎక్కువగా మసాలా వంటలను చేసినప్పుడు దాల్చిన చెక్కను కూడా ఉపయోగిస్తుంటారు. దాల్చిన చెక్కను వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. దాల్చిన చెక్కను మనం ఎంతో కాలం నుంచే మసాలా దినుసుగా ఉపయోగిస్తున్నాం. అయితే ఆయుర్వేద ప్రకారం దాల్చిన చెక్క అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. దాల్చిన చెక్కను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక వ్యాధులను తగ్గించుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అయితే మహిళలకు ఇది ఎంతో మేలు చేస్తుందని వైద్యులు అంటున్నారు. దాల్చిన చెక్కను తీసుకోవడం వల్ల స్త్రీలకు ఎంతగానో మేలు జరుగుతుందని అంటున్నారు. దాల్చిన చెక్క పొడిని రోజూ మీరు తినే ఆహారాలపై చల్లి తినవచ్చు. లేదా దాల్చిన చెక్క వేసి మరిగించిన నీళ్లను కూడా తాగవచ్చు. దీంతో స్త్రీలకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ప్రస్తుతం చాలా మంది మహిళలు పీరియడ్స్ సరిగ్గా రాక అవస్థలు పడుతున్నారు. అయితే దాల్చిన చెక్క నీళ్లను తాగడం వల్ల ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. దాల్చిన చెక్క నీళ్లను తాగుతుంటే హార్మోన్లు బ్యాలెన్స్ అవుతాయి. గర్భాశయానికి రక్త ప్రసరణ పెరుగుతుంది. దీంతో పీరియడ్స్ సరిగ్గా వస్తాయి. అలాగే పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. పాలిసిస్టిక్ ఓవరీ సింఢ్రోమ్ (పీసీవోఎస్) అనే సమస్యతో ప్రస్తుతం చాలా మంది స్త్రీలు బాధపడుతున్నారు. అలాంటి వారు దాల్చిన చెక్క నీళ్లను తాగితే చక్కని పరిష్కారం లభిస్తుంది. ఈ నీళ్లను సేవించడం వల్ల పీసీవోఎస్ సమస్యకు చెక్ పెట్టవచ్చు. అండాశయంలో ఏర్పడే నీటి బుడగలు తొలగిపోతాయి. దీంతో సంతానం కలిగే అవకాశాలు పెరుగుతాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

దాల్చిన చెక్కలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. మహిళలు గర్భంతో ఉన్నప్పుడు డయాబెటిస్ బారిన పడుతుంటారు. షుగర్ లెవల్స్ పెరిగిపోతాయి. అయితే డాక్టర్ సూచన మేరకు దాల్చిన చెక్క నీళ్లను తాగితే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అలాగే అతి మూత్ర వ్యాధి నుంచి కూడా బయట పడవచ్చు. మూత్రం సాఫీగా జారీ అవుతుంది. దాల్చిన చెక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దాల్చిన చెక్కలో సినామాల్డిహైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

**హార్ట్ ఎటాక్ రాదు..**

ప్రస్తుత తరుణంలో స్త్రీలకు సైతం గుండె జబ్బులు అధికంగా వస్తున్నాయి. ఇందుకు కారణం కొలెస్ట్రాల్ అధికంగా పేరుకుపోవడమే అని నిపుణులు చెబుతున్నారు. మహిళలు చాలా వరకు ఇంటి పట్టునే ఉంటారు. ఎలాంటి శారీరక శ్రమ ఉండదు. కనుక వారిలో కొవ్వు అధికంగా చేరుతుంది. దీంతో రక్త నాళాల్లో కొలెస్ట్రాల్ చేరి అది హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుంది. అయితే స్త్రీలు దాల్చిన చెక్క నీళ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. దీని వల్ల రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. ఇలా మహిళలకు దాల్చిన చెక్క నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. కనుక రోజూ వాటిని తాగడం మరిచిపోకండి.

## అయ్యప్ప స్వామి సన్నిధిలో ఘనంగా శివరాత్రి వేడుకలు



**కోదాడ అనంతగిరి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** అనంతగిరి మండల కేంద్రంలోని గుట్టపై గల తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అయ్యప్ప సన్నిధిలో మహాశివరాత్రి పర్వదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాయిలింగేశ్వర స్వామి వారికి తెల్లవారుజామునుండే విశేష అభిషేకములు అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు కత్రం బాపూజీ రెడ్డి, కక్కిరేణి రామారావు ,కక్కిరేణి ప్రభాకర్, ఎర్ర సాని మన్మధ కుమార్ ,ఈదుల యాదగిరి, గాదం శ్రీను ,పాలిక నరసింహారావు ,సంఘం ఉపేందర్ ,వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంతం

**- టీచర్స్ 92.85శాతం గ్రాడ్యుయేట్స్ 80.32శాతం**



**మహాదేవపూర్ ఫిబ్రవరి 27, ( నినాదం న్యూస్):** అదిలాబాద్ కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మండలంలో 14 మంది ఓటర్లు ఉండగా 13 మంది ఓట్లు వేశారని, గ్రాడ్యుయేట్స్ 610 మంది ఓటర్లు ఉండగా 490 ఓట్లు పోలయ్యాయని 371 పురుష ఓటర్లు, 119 మంది మహిళ ఓటర్లు పాల్గొన్నట్లు తహసిల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 92.85%, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీకి 92.85% ఓట్లు పోలయ్యాయని వారు వివరించారు. మహాదేవపూర్ సిఐ రామచందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## ఉన్నట్లుండి సడెన్‌గా బరువు పెరిగారా..

**- అయితే అందుకు కారణాలు ఇవే..!**

అధిక బరువును తగ్గించుకోవడం అన్నది ఎంత కష్టంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. బరువును తగ్గించుకునేందుకు ప్రయత్నం చేసే వారికే ఆ బాధ ఏమిటనేది తెలుస్తుంది. కొందరు ఆహారం తిన్నా తినకపోయినా విపరీతంగా బరువు పెరిగిపోతుంటారు. కొందరు ఎంత తిన్న కూడా సన్నగానే ఉంటారు. దీనికి శరీర తత్వం, జన్యువులే ప్రధాన కారణమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎవరైనా అధికంగా బరువు పెరుగుతున్నారంటే అందుకు అధికంగా ఆహారం తీసుకోవడం ఒక్కటే కాదు, ఇంకా అనేక కారణాలు ఉంటాయని అంటున్నారు. బరువు పెరిగేందుకు అనేక కారణాలు దోహదం చేస్తాయని అంటున్నారు. అయితే ఎందుకు బరువు పెరుగుతున్నారో కనిపెట్టగలిగితే సమస్య నుంచి బయట పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**థైరాయిడ్..**

థైరాయిడ్ సమస్య ఉంటే సహజంగానే బరువు పెరుగుతారు. థైరాయిడ్‌లో రెండు రకాలు ఉంటాయని అందరికీ తెలిసిందే. ఒకటి హైపర్ థైరాయిడ్ కాగా రెండోది హైపో థైరాయిడ్. హైపో థైరాయిడ్ సమస్య ఉన్నవారు ఆహారం తినకపోయినా బరువు పెరుగుతుంటారు. ఎందుకంటే వీరిలో మెటబాలిజం సరిగ్గా ఉండదు. శరీరం క్యాలరీలను సరిగ్గా ఖర్చు చేయలేదు. దీంతో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. ఇది అధిక బరువుకు దారి తీస్తుంది. కనుక ఉన్నట్లుండి సడెన్‌గా బరువు పెరుగుతున్నారు అంటే అందుకు థైరాయిడ్ కారణంగా భావించాలి. థైరాయిడ్ ఉందా, లేదా అని పరీక్ష చేయించుకోవాలి. ఒక వేళ థైరాయిడ్ గనక ఉంటే చికిత్స తీసుకోవాలి. దీంతో బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుంది.

**ఒత్తిడి, ఆందోళన..**



మహిళలు ఉన్నట్లుండి సడెన్‌గా బరువు పెరుగుతుంటే అందుకు పీసీఓఎస్ అనే వ్యాధి కారణం అవుతుందేమోనని అనుమానించాలి. పాలిసిస్టిక్ ఓవరీ సింఢ్రోమ్‌గా పిలవబడే ఈ వ్యాధి వస్తే స్త్రీలలో అండాశయాల్లో నీటి బుడగలు ఏర్పడుతాయి. దీంతో సంతానం కలిగే అవకాశాలు తగ్గిపోతాయి. అలాగే హార్మోన్ల అసమతుల్యత వల్ల బరువు పెరుగుతారు. మహిళలు సడెన్‌గా బరువు పెరిగిపోతుంటే ఈ వ్యాధి ఉందో లేదో పరీక్షలు చేయించుకోవాలి. ఒక వేళ వ్యాధి ఉంటే చికిత్స తీసుకోవాలి. దీంతో బరువు కూడా తగ్గుతారు. అలాగే ఆందోళన, డిప్రెషన్‌తో బాధపడుతున్నవారు కూడా అధికంగా బరువు పెరుగుతారని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. మీకు కూడా ఒత్తిడి, ఆందోళన ఉన్నాయేమో చెక్ చేసుకోండి. ఉంటే వాటి నుంచి బయట పడే ప్రయత్నం చేయండి. దీంతో బరువును తగ్గించుకోవడం సులభతరం అవుతుంది.

**హార్మోన్ల సమస్యలు..**

మెనోపాజ్ దశలో ఉండే స్త్రీలు కూడా అధికంగా బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ దశలో ఉన్న స్త్రీలలో హార్మోన్లు సరిగ్గా విడుదల కావు. ఇవి బరువు పెరిగేలా చేస్తాయి. అలాగే ఒత్తిడి స్థాయిలు అధికంగా ఉండే వారిలో కూడా హార్మోన్ల సమతుల్యత సరిగ్గా ఉండదు. దీని వల్ల ఆహారాన్ని అధికంగా తింటుంటారు. ఇది బరువు పెరిగేందుకు కారణం అవుతుంది. అదేవిధంగా కొందరు స్త్రీలకు అండాశయం లేదా గర్భాశయంలో గడ్డలు ఉంటాయి. అలాంటప్పుడు అవి హార్మోన్ల సమస్యలను కలగజేస్తాయి. దీంతో స్త్రీలు అధికంగా బరువు పెరుగుతారు. కొన్ని రకాల మందులను వాడే వారు కూడా అధికంగా బరువు పెరుగుతారు. మెటబాలిజం, హార్మోన్లకు సంబంధించి మెడిసిన్లను ఉపయోగించే వారు బరువు పెరుగుతారు. స్టెరాయిడ్స్ వాడినా కూడా బరువు పెరుగుతారు. సరిగ్గా నిద్ర పోక పోయినా బరువు పెరుగుతారని పరిశోధకుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కనుక మీరు ఉన్నట్లుండి సడెన్‌గా బరువు పెరిగితే అందుకు కారణం తెలుసుకోండి. దీంతో పెరిగిన బరువును సులభంగా తగ్గించుకోవచ్చు.

# భారతదేశం గర్వించదగిన గొప్ప సైన్స్ శాస్త్రవేత్త

## నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్



నా మతం సైన్స్,నేను సైన్స్ నే పూజిస్తాను,ప్రేమిస్తాను నా బతుకు అంత సైన్స్ అన్న మహానుభావుడు సి.వి.రామన్.ఎన్నో ఆవిశ్కరనలకు మూలం సైన్స్,ప్రపంచము గర్వించే లా మన భారతీయ సైన్స్ ఎదగాలి.మన ప్రయోగాలు చూసి ఇతర దేశాల వారు మన నుండి స్పూర్తి ని పొందాలి.ఈ మాటలు అన్ని రామన్ చెప్పిన సత్యములు.అతను ఒక విజ్ఞాన శాస్త్ర ఘని,ధృవతార. సి.వి.రామన్ నవంబర్ 7, 1888 న జన్మించాడు. భారతదేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టాడు. 1930 డిసెంబరులో రామన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది. 1954లో భారత ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించింది. ఆయన పరిశోధన ఫలితాన్ని ధ్రువపరిచిన రోజును (ఫిబ్రవరి 28) జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.చంద్రశేఖర్ వెంకటరామన్ 1888 నవంబర్ 7 వ తేదీన తిరుచినాపల్లి సమీపంలోని అయ్యన్ పెటాయ్ అనే గ్రామంలో జన్మించాడు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. వారిది మధ్య తరగతి కుటుంబం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. విశాఖపట్నంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. సి.వి.రామన్ చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్ర విషయాల పట్ల అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవారు. ఆయన తండ్రి భౌతిక అధ్యాపకులవడం, అతనిని భౌతికశాస్త్రం వైపు మరింత కుతూహలం పెంచుకునేలా చేసింది. చిన్నతనం నుంచి తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్న రామన్ తన 12వ ఏట మెట్రిక్యులేషన్ (ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించి) పూర్తి చేశాడు. 1907లో ఎం.యస్.సి (ఫిజిక్స్)లో యూనివర్సిటీకి ప్రథముడిగా నిలిచారు. తన 18 వ ఏటనే కాంతికి సంబంధించిన ధర్మాలపై ఈయన పరిశోధనా వ్యాసం లండన్ నుంచి వెలువడే ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమైంది. ఆయనలోని పరిశోధనాభిరుచిని పరిశీలించిన అధ్యాపకులు ప్రోత్సహించి ఇంగ్లాండు వెళ్ళి పరిశోధన చేయమన్నారు. కానీ ప్రభుత్వం నిర్వహించిన వైద్య పరీక్షలో ఒక వైద్యుడు ఆయన ఇంగ్లాండు వాతావరణానికి సరిపడదని తేల్చడంతో అతను ఇంగ్లాండు ప్రయాణం విరమించుకున్నాడు. నన్ను అన్‌ఫిట్ అన్న ఆ డాక్టరుకు నేనెంతో రుణపడి ఉన్నాను. అని తర్వాత రామన్ పేర్కొన్నారు. ఎమ్మే చదివి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేశారు.1907లో ఉద్యోగరీత్యా కలకత్తాకు బదిలీ అయ్యారు. అక్కడ ఇండియన్ సైన్స్ అసోసియేషన్‌కు రోజూ వెళ్ళి పరిశోధనలు చేసుకునేవారు. రామన్ ఆసక్తిని గమనించిన కలకత్తా విశ్వవిద్యాలయం ఉపకులపతి అశు తోష్ ముఖర్జీ బ్రిటీష్ ప్రభుత్వానికి లేఖ రాస్తూ రామన్ సైన్స్ పరిశోధనలను పూర్తి కాలానికి వినియోగించుకుంటే బాగుంటుం దని సూచించారు. కానీ, బ్రిటీష్ ప్రభుత్వంఅంగీకరించలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి పరిశోధనలు కొనసాగించాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఉద్యోగంలో చేరే ముందు అమ్మాళ్‌తో పెళ్ళయింది. ఒకసారి కలకత్తాలో ప్రయాణం చేస్తున్నప్పుడు బౌబజారు స్ట్రీట్ వద్ద ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ అనే బోర్డు చూసి పరుగు పరుగున వెళ్ళాడు. ఆ సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ అమృతలాల్ సర్కార్‌ను కలిసి పరిశోధన చేయడానికి అనుమతిని పొందాడు. పరిశోధనలపై ఉన్న ఆసక్తి వలన తెల్లవారుజామున ఐదున్నరకే ఐసిఎస్‌కు వెళ్ళేవారు. తర్వాత ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగం, తిరిగి సాయంకాలం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరిశోధన, ఆదివారాలు, సెలవు దినాలు పరిశోధనలోనే గడిచేవి.అతని తల్లి పార్వతి అమ్మాళ్‌కు సంగీతంలో మంచి అభిరుచి ఉండేది. ఆమె వీణను అద్భుతంగా వాయించేది. అందుకే రామన్ తొలి పరిశోధనలు వయొలిన్, వీణ, మృదంగం వంటి సంగీతవాయిద్యాల గురించి సాగాయి. విజ్ఞాన పరిశోధన తృష్ణ వలన తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసరుగా చేరారు. 1921లో లండన్‌లో తను అధ్యయనం చేసిన సంగీత పరికరాల శబ్ద రహస్యంపై ఉపన్యాసాలు ఇచ్చాడు. అప్పుడు శ్రోతల్లోని ఒకరు ఇలాంటి అంశాలతోరాయల్ సొసైటీ సభ్యుడవు కావాలనుకుంటున్నావా అంటు అన్నప్పుడు ఆయనలో పరిశోధనలపై మరింత ఆసక్తి పెరిగింది. శబ్దశాస్త్రం నుంచి తన పరిశోధనలను కాంతి శాస్త్రం వైపు మార్చాడు. తన తిరుగు ప్రయాణంలో ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు ఆకాశం, సముద్రం నీరు రెండింటికి నీలిరంగు ఉండటం ఆయనను ఆలోచింపచేసింది. అప్పటిదాకా అనుకుంటున్నట్లు సముద్రపు నీలి రంగుకు కారణం ఆకాశపు నీలిరంగు సముద్రం మీద ప్రతిఫలించడం కాదు. సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు కాంతి పరిక్షేపణం చెందడమే కారణం అని ఊహించాడు. కలకత్తా చేరగానే తన ఊహను నిరూపించడానికి ద్రవాలు, వాయువులు, పారదర్శక ఘనపదార్థాలు కాంతి పరిక్షేపణం గురించి పరిశోధనలు చేశారు. అందుకు యువశాస్త్రవేత్తలైన కె.ఆర్.రామనాథన్, కె.యస్ .కృష్ణన్ ఆయనకు అండగా నిలిచారు. 1927 డిసెంబరులో ఒకరోజు సాయంత్రం కె.యస్.కృష్ణన్ రామన్ వద్దకు పరుగెత్తుకొని వచ్చి కాంప్టన్ (భౌతిక శాస్త్రవేత్త)కు నోబెల్ బహుమతి వచ్చిందని ఆనందంతో చెప్పగానే రామన్ ఎక్సలెంట్ న్యూస్ అని సంతోషపడ్డారు. కాంప్టన్ ఫలితం ఎక్సరేయిస్ విషయంలో నిజమైనపుడు, కాంతి విషయాలలో నిజం కావాలి కదా అనే ఆలోచనలో పడ్డాడు. ఆ ఆలోచనే రామన్ ఎఫెక్టుకు దారితీసింది. తగినంత అధునాతనమైన పరికరాల్లేకపోయినా, రామన్ తన ఆలోచనకు ప్రయోగ రూపంలో జవాబు లభిస్తుందని నమ్మకంగా ఉన్నాడు.అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న రామన్ ఎఫెక్టు అంటే పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింపచేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుంది. ఈ దృగ్విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞులసదస్సులో చూపించాడు. అందుకే బ్రిటీష్ ప్రభుత్వం 1929లో నైట్‌హుడ్ బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్యమైనదని, అందులో 200 రూపాయలు కూడా ధరచేయని పరికరాలతో ఆ దృగ్విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులందరూ రామన్‌ను అభినందించారు. ఈయన పరిశోధన యొక్క విలువను గుర్తించి 1930లో నోబెల్ బహుమతి ప్రదానం చేశారు. ఆ మహనీయుని సేవలను భారత ప్రభుత్వం గుర్తించి 1954లో 'భారతరత్న' అవార్డు బహుకరించిన సమయంలో సందేశాత్మక ఉపన్యాసం ఇస్తూ 'విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగశాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞానశాస్త్ర సాగరాన్ని మధించి వేస్తాయి' అన్న మాటలు నేటికి ఆలోచింపచేసేవి. ఆయన నాజీవితంలో ఒక విఫల ప్రయోగం.

ఎందుకంటే నేను నా మాతృభూమిలో నిజమైన సైన్స్ నిర్మాణం చేయగలననుకున్నాను. అంటూ చివరి వరకు భారతదేశంలో సైన్స్ అభివృద్ధికై పాటుపడ్డ ఆ మహనీయుడు 1970 నవంబర్ 21 న భౌతికంగా కన్నుమూసినా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించుకొని ఆయనను చిరంజీవిగా మనమధ్యే నిలిపేలా కొన్ని సంస్థలు ఆయన పేరు మీద టాలెంట్ టెస్ట్‌లు, సైన్స్‌కు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నాయి. విద్యార్థినీ, విద్యార్థుల్లో ఆయన స్ఫూర్తిని నింపుతూ సైన్స్ అంటే మక్కువ కలిగేలా చేస్తున్నాయి. 1928లో ఫిబ్రవరి 28న ఈయన రామన్ ఎఫెక్టును కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని భారతదేశంలో ఫిబ్రవరి 28వ తారీఖును నేషనల్ సైన్స్ డే గా జరుపుకుంటారు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశం మరింత అభివృద్ధి సాధించాలి.రామన్ ని ఆదర్శంగా తీసుకోవాలి .వారి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి.వారి సేవలను స్మరించుకుందాం.

**కామిడి సతీష్ రెడ్డీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా..**
**9848445134.**

# ఒకరికి బదులు మరొకరు ఓటు

## టెండర్ ఓటు అవకాశం



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 27(నినాదం న్యూస్):** జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో అధికారం నిర్లక్ష్యం కారణంగా ఒకరికి బదులు మరొకరు ఓటు వేశారు. మండల కేంద్రానికి చెందిన అరిగల మల్ల గౌడ్ పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వెళ్ళాడు. నీ బదులు వేరొకరు ఓటు వేశారని అక్కడ అధికారులు చెప్పడంలో ఒక్కసారిగా అవక్కయ్యాడు. దీంతో ఆయన ప్రిసైడింగ్ అధికారిని కలిసి పోలింగ్ బూత్ స్లిప్, గుర్తింపు కార్డు చూపించాడు. దీంతో అతని వద్ద ఉన్న ఆధారాలు సరైనవేనని గుర్తించారు. వెంటనే ఆయనకు టెండర్ ఓటు అవకాశం కల్పించారు. ఏది ఏమైనా అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహాకుంభమేళాలో 66కోట్ల

# మంది పుణ్యస్నానాలు

### - రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయి

### - వివరాలు వెల్లడిరచిన యూపి ప్రభుత్వం

**లక్నో:** మహా కుంభమేళా విజయవంతంగా ముగియడంతో ఎంతమంది వచ్చారన్న లెక్కలను యూపి ప్రభుత్వం తీసింది. ప్రయాగ్‌రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు మహా కుంభమేళా జరిగింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రితో కుంభమేళా గ్రాండ్‌గా ముగిసింది. కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అంతేకాకుండా కోట్లలో బిజినెస్ కూడా నడిచింది. ఇందుకు సంబంధించిన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగంలో దాదాపు 66 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లుగా ప్రభుత్వం తెలిపింది. ఇక రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయని పేర్కొంది. పరోక్షంగా.. ప్రత్యక్షంగా 60 లక్షల మంది జీవనోపాధి పొందినట్లుగా వెల్లడిరచింది. దాదాపు 150 కి.విరీ మేర వ్యాపారాలు జరిగాయని పేర్కొంది. ప్రపంచంలోనే ఇంత పెద్ద మతపరమైన పండుగ ఇదేనని పరమార్థ నికేతన్ అధ్యక్షుడు స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ప్రయాగ్‌రాజ్ ఒక చరిత్ర సృష్టించిందని చెప్పారు.యాత్రికులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడానికి 16 బ్యాంకులు ప్రాంగణంలో శాఖలను ఏర్పాటు చేశాయి. ఈ బ్యాంకులు రూ. 37 కోట్ల విలువైన లావాదేవీలను నిర్వహించాయి. వీటిలో ఎక్కువ డిపాజిట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో నమోదయ్యాయి. గణనీయమైన సంఖ్యలో భక్తులు నగదు జమ చేశారని, ఉపసంహరణలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. మైదానంలో 50 మొబైల్ ఎటిఎంలతో సహా 55 ఎటిఎంబూత్‌లు ఏర్పాటు చేశారు. అయితే డిజిటల్ లావాదేవీలు పెరగడంతో ఎటిఎంలకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 76 దేశాల ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. భారతీయ సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వంపై అంతర్జాతీయంగా ఆసక్తిని కనుబరిచారు. భూటాన్ రాజు, వివిధ దేశాల మంత్రులు మరియు ప్రముఖులతో కలిసి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. నేపాల్ నుంచి 50 లక్షలకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించగా? 27 ఇతర దేశాల నుంచి రెండు లక్షలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య సందర్శించారు.అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, అనేక మంది కేంద్ర మంత్రులు సహా భారతదేశ అగ్ర నాయకత్వం పాల్గొంది. గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, అక్షయ్ కుమార్ వంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. తాజాగా దీన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ ఎక్స్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'మహా కుంభమేళా పూర్తయింది. ఐక్యత మహా యజ్ఞం పూర్తయింది. 45 రోజుల పాటూ ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ మేళాలో 140 కోట్ల దేశ ప్రజల విశ్వాసం అద్భుతమైంది.' అంటూ కొనియాడుతూ మోడీ రాసుకొచ్చారు.

## సహస్రాధిక వ్యాస

# రచయిత జానమద్ది

తెలుగు భాష వికాసం కోసం అహర్నిశలూ శ్రమించి, అహరహం ఆలోచించి, నిరంతరం తపించిన సాహితీ తపస్వి జానమద్ది హనుమచ్ఛాస్త్రి. విజ్ఞాన సర్వస్వంగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఎందరికో ఆదర్శప్రాయంగా, స్ఫూర్తి దాయకంగా, మార్గ నిర్దేశం చేశారు హనుమచ్ఛాస్త్రి. జానమద్ది హనుమచ్ఛాస్త్రి 1926 జూన్ 5 న అనంతపురం జిల్లా రాయదుర్గం లో జన్మించారు. జానకమ్మ , సుబ్రహ్మణ్యశాస్త్రి వీరి తల్లిదండ్రులు. ఎస్ఎస్ఎల్సీ తరువాత కొన్ని కారణాల వల్ల పై చదువులు చదవలేక పోయినా, ఉపాధ్యాయ శిక్షణ అనంతరం, ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తరువాత ఆంగ్లంలోను, తెలుగులోను ఎంఏ పట్టాలు పొందారు. చాలా కాలం కడప డిగ్రీ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేశారు. జానమద్ది యవ్వన దశలో రంగస్థల నటుడిగా కూడా రాణించారు. నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవాచారితో పరిచయం ఏర్పడటం, నాటక రంగం మీద ఆయనకు ఇష్టం ఏర్పడడమే కాక రాఘవ సరసనే పాదుకా పట్టాభిషేకం నాటకంలో నటించారు. తర్వాత చంద్రగుప్త నాటకంలో జానమద్ది చంద్రగుప్తుడు తల్లి మురా పాత్రను ఎంతో గొప్పగా పోషించారు. ఇలా రంగస్థల నటుడిగా కూడా తన ప్రతిభ కనబరిచారు. స్కూళ్ల ఇన్ స్పెక్టర్ గా, జిల్లా విద్యావిషయక సర్వే ఆఫీసర్ గా, కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ గా నాలుగు దశాబ్దాలు పనిచేశారు. కడప లో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు. ట్రస్టును నెలకొల్పి, దాని మొదటి కార్యదర్శిగా అహర్నిశలూ పాటుపడి 10 లక్షల రూపాయల విరాళాలు సేకరించారు. జానమద్ది కృషి కారణంగా బ్రౌన్ లైబ్రరీలో దాదాపు లక్ష గ్రంథాలు, 300 వరకు తాళపత్ర గ్రంథాలు, తెలుగు గ్రామాల స్థానిక చరిత్ర తెలిపే మెకంజీ కైఫీయత్తులు, బ్రౌన్ లేఖలు, రాతప్రతులు సమ కూరాయి. బ్రౌన్ లైబ్రరీకి ఏటా ముప్పై లక్షల రూపాయల గ్రాంట్ ను ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డి తో మంజూరు చేయించుకొన్న ఘనత ఆయనది. డాక్టర్ జానమద్ది ఆరు దశాబ్దాల తన సాహితీ ప్రస్థానంలో సహస్రాధిక వ్యాసాలను రాశారు. శతాధిక ప్రముఖుల జీవిత చరిత్రలను గ్రంథస్తం గావించారు. ఆయన రచన ప్రచురించని పత్రిక లేదనే ఖ్యాతి పొందారు. ఆకాశ వాణి కేంద్రాల నుంచి అనేక అంశాలపై 150కి పైగా ప్రసంగాలు చేశారు. కరుణశ్రీ, బోయి భీమన్న, దాశరథి, పురిపండ అప్పలస్వామి, పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీ శ్రీ, డా.బెజవాడ గోపాలరెడ్డి మొదలైన ప్రసిద్ధులైన సాహితీ వేత్తలతో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు స్నేహం ఉండేది. తెలుగు, ఆంగ్ల, కన్నడ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమైన దాదాపుగా 2500 వ్యాసాలు వీరి నిరంతరం సాహితీ సేవకు ప్రతిబింబాలు. 1964లో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్యకు, తాళ్లపాకలో గుడి కట్టించడానికి తాళ్లపాక గ్రామస్థులకు ప్రేరణనిచ్చి సఫలీకృతులయ్యారు. తాళ్లపాకలో ప్రసిద్ధి చెందిన అన్నమయ్య గుడికి ఆనాడు బీజం వేసింది జానమద్ది వారే. సర్వమత సౌభ్రాతృత్వంతో జీవిత యాత్ర సాగించిన ఆయన జాన్ అహ్మద్ శాస్త్రి గా పేరు గడించారు. జానమద్దికి అనేక అవార్డులు లభించాయి. 1980లో బళ్లారి రాఘవ శతజయంతి పురస్కారం, కర్ణాటక రాష్ట్ర పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, 1988లో వావిలాల గోపాలకృష్ణయ్యచే పురస్కారం, 2003లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిచే సత్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కారం, లోకనాయక్ ఫౌండేషన్ సాహితీపురస్కారం, కవిత్రయ పురస్కారం, గుంటూరులో అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలిత కళా పరిషత్ అవార్డు, ధర్మవరం కళాజ్యోతి వారి సిరిసి ఆంజనేయులు అవార్డు, కడప సవేరా ఆర్ట్స్ వారి సాహితీ ప్రపూర్ణ అవార్డు, మదనపల్లి భరతముని కళారత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం, ఢిల్లీ ఆంధ్ర సంఘం సత్కారం, అయ్యంకి వెంకటరమణయ్య పురస్కారం... ఇలా మూడు పదులకు పైగా సత్కార, పురస్కారాలను అందుకొన్నారు. ఉడిపి పెజావరు పీఠాధిపతిచే 'ధార్మికరత్న' బిరుదు మొదలైన అనేక పురస్కారాలు ఇతనికి లభించాయి. శాస్త్రిగారి నిర్విరామ తెలుగు భాషా సాహిత్యసేవను గుర్తించి జ్ఞానపీఠ పురస్కార్ గ్రహీత డా.సి.నారాయణరెడ్డి ఆయనను 'బ్రౌన్‌శాస్త్రి' బిరుదుతో సత్కరించారు. తనకెన్ని సత్కారాలు జరిగినా ఈ బిరుదు తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పేవారు.

# ఇప్పటి నుంచి దేవాదాయశాఖకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి

**హైదరాబాద్** :పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలి వస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మీ ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మీ ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మీ అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మీ ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి.

# పలు ప్రత్యేకతల సమాహారం మొరార్జీ దేశాయ్ జీవితం

పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే – ఎ – పాకిస్తాన్ – 1986 లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. 1927–28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, అతను బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల – వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ చురుకైన రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు.

# రాజ్యాంగ శిల్పి రాజేంద్ర ప్రసాద్

## భారత తొలి రాష్ట్రపతి వర్ధంతి

**భారతదేశానికి అధ్యక్షునిగా రాజ్యాంగం ప్రకారం భాద్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీకి చెందకుండా స్వతంత్రుడిగా వ్యవహరించిన ప్రత్యేక వ్యక్తిత్వం భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ ది.ఒక రాష్ట్రపతిగా పక్షపాత ధోరణి లేకుండా, స్వతంత్రంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పిన ఆదర్శ నేత ఆయన.1957లో రాష్ట్రపతిగా ఎన్నికై, రెండు సార్లు భారత రాష్ట్రపతిని చేపట్టిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. దేశానికి మొట్టమొదటి రాష్ట్రపతిగా స్వతంత్రంగా మెలిగి, ప్రధానిని గానీ పార్టీని గానీ రాజ్యాంగ నిర్మాణంలో జోక్యం చేసుకోనీక, తరువాత రాష్ట్రపతులకు ఉదాహరణగా నిలిచారు.**




ప్రజలు ప్రేమగా, గౌరవంగా 'బాబూ' అని పిలుచుకునే డా. రాజేంద్ర ప్రసాద్ (1884 డిసెంబర్ 3 %–% 1963 ఫిబ్రవరి 28) భారత దేశపు మొట్టమొదటి రాష్ట్రపతి. 1950 నుండి 1962 వరకు రెండు సార్లు రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వహించారు. బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగి, భారత జాతీయ కాంగ్రెస్ లో భారత స్వాంతంత్ర్యోద్యమ కాలంలో చేరారు. మహాత్మాగాంధీ మద్దతు దారునిగా 1931 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం, 1941లోజరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1946 ఎన్నికల తరువాత నెహ్రూ మంత్రి వర్గంలో ఆహారం, వ్యవసాయం శాఖకు భారత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచబడిన సంఘానికి అధ్యక్షులు. 1951 సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటి భారత పార్లమెంటు ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిగా ఎన్నుకోబడిన నేత.

రాజేంద్ర ప్రసాద్ బీహార్ రాష్ట్రంలో శివాన్ జిల్లాలోని జెర్దాయ్ గ్రామంలో 1884లో డిసెంబరు 3 న జన్మించాడు. అతని తండ్రి మహదేవ్ సహాయ్ సంస్కృతం, పర్శియను భాషలలో పండితులు. తల్లి కమలేశ్వరీ దేవి ఎప్పుడూ రామాయణం నుండి కథలు వివరించేది. ఐదవ ఏటనే పర్షియన్ భాష, హిందీ భాష , అంకగణితం ను నేర్చుకోవడానికి ఒక మౌల్వీ (ముస్లిం పండితుడు) దగ్గరకు పంపించ బడ్డారు. తరువాత ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసారు. 12 సంవత్సరాల వయసులోనే రాజ్‌వంశీ దేవిని వివాహం చేసుకున్నారు. అటు తరువాత విద్యకై పాట్నాలో కె.ఘోష్ పాఠశాలలో చదువుకున్నారు. ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో చేరి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై నెలకు రూ.30 ఉపకారవేతనం పొందారు.

1902లో అతడు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. మొదట్లో సైన్సు విద్యార్థి. 1904లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎఫ్.ఎ ఉత్తీర్ణుడయ్యారు. అక్కడే 1905లో మొదటి స్థానంలో గ్రాడ్యుయేషన్ చేసారు. అతని అధ్యాపకులలో జగదీష్ చంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రాయ్ మొదలగువారు ఉన్నారు. ఆయన మేథాశక్తికి ఒక ఎక్జామినర్ (పరీక్షకుడు) ప్రభావితుడై అతడి పరీక్షా జవాబు పత్రంపై "పరీక్షకుని కంటే పరీక్షితుడు గొప్పవాడు" అనే వ్యాఖ్య రాశారు.

1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. బి.ఎల్. ఆ తర్వాత ఎం.ఎల్. పూర్తి చేసి డాక్టరేట్ కూడా పొందారు. అన్నతో కలిసి స్వదేశీ ఉద్యమాన్నీ నడిపారు. అతడు "ద్వాన్ సమాజం" లో క్రియాశీల సభ్యునిగా సేవలందించారు. అతడు పాట్నా కళాశాలలో1906లో జరిగిన బీహారీ స్టూడెట్స్ కాన్ఫరెన్సు ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.



ఉపాధ్యాయునిగా అనేక విద్యాసంస్థలలో పనిచేసారు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పూర్తి చేసిన తరువాత అతడు బీహార్ లోని ముజఫర్‌పూర్ లాంగట్ సింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా చేరారు. తరువాత ఆ సంస్థకు ప్రధానాచార్యునిగా తన సేవలనందించారు. తరువాత 1909లో కలకత్తాలోని రిప్పన్ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించడానికి గాను ఉద్యోగాన్ని వదిలి వెళ్ళారు. అతడు ఆ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించే సమయంలో కలకత్తా సిటీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసారు. 1915 లో "మాస్టర్ ఆఫ్ లా" పరీక్షలకు హాజరై ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకాన్ని పొందారు. 1937లో అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందారు.

1916 లో, బీహార్, ఒడిషా రాష్ట్రాల హైకోర్టులలో చేరాడు. తరువాత 1917లో అతడు పాట్నా విశ్వ విద్యాలయంలోని సెనేట్, సిండికేట్ లో మొదటి సభ్యునిగా నియమింప బడ్డారు.

న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అనతికాలంలో స్వాతంత్ర్య పోరాటంవైపు ఆకర్షితు డై, 1906లో మొదటి సారి కలకత్తాలో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల ద్వారా సంబంధాన్ని పెంచుకున్నారు. 2011లో రెండవసారి వార్షిక సమావేశాల సమయంలో జాతీయ కాంగ్రెస్ లో చేరారు. 1916 లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో మహాత్మా గాంధీని కలిసారు. చంపారన్ లో జరగనున్న నిజ నిర్ధారన కమిటీలోనికి తనతో పాటు స్వచ్ఛంద కార్యకర్తగా రావాలని మహాత్మా గాంధీ అతనిని కోరారు.

1918 లో'సర్చ్ లైట్'అనే ఆంగ్ల పత్రికను, ఆ తర్వాత 'దేశ్' అనే హిందీ పత్రికను నడిపారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. అతడు తన లాభదాయకమైన న్యాయవాద వృత్తిని, అలాగే విశ్వవిద్యాలయంలోని అధ్యాపక వృత్తి విధులను తప్పుకున్నాడు. భారతీయ సాంప్రదాయ విధానాలలో విద్యాభ్యాసం అందిస్తున్న బీహార్ విద్యాపీఠాన్ని 1921లో తన మిత్రబృందంతో కలిసి స్థాపించి భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నడిపారు. 1921లో మహాత్మా గాంధీతో ఒకమారు సమావేశం తరువాత, విశ్వవిద్యాలయంలో తన సెనేటర్ పదవికి రాజీనామా చేశారు.

రాజేంద్రప్రసాద్ 1934 అక్టోబరులో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అలాగే 1939లో, నేతాజీ రాజీనామా చేసిన తరువాత, 1947లో ఇంకోసారి, మొత్తం మూడుసార్లు ఆ పదవిని చేపట్టారు. 1942 ఆగస్టు 8 న క్విట్ ఇండియా సంధర్భంగా అరెస్టు చేసి, బాంకిపూర్ కేంద్ర కారాగానికి తరలించారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష తర్వాత, 1945, జూన్ 15 న విడిచిపెట్టారు.

1946 సెప్టెంబరు 2 న ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం జవాహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో 12 మంది మంత్రులను ఎంపిక చేయగా, రాజేంద్ర ప్రసాద్ ఆహారం, వ్యవసాయ శాఖకు మంత్రిగా పనిచేసారు. 1946 డిసెంబరు 11 న రాజ్యాంగ సభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కృపాలానీ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజీనామా చేసిన తరువాత 1947 నవంబరు 17 న కాంగ్రెస్ అధ్యక్షునిగా భాధ్యతలు స్వీకరించారు.

భారత స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత 1950 జనవరి 26 న స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించ బడింది. రాజేంద్ర ప్రసాద్ ను తొట్టతొలి రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు.

భారతదేశంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నెహ్రూ కు వివిధ సందర్భాలలో సలహాల నిచ్చేవారు. "హిందూ కోడ్ బిల్" చట్టం పై వివాదాల తరువాత అతను రాష్ట్ర వ్యవహారాల్లో మరింత చురుకైన పాత్రను పోషించారు. 12 సంవత్సరాల పాటు భారత రాష్ట్రపతిగా సేవలందించి 1962 న పదవీ విరమణ చేశారు.1963 ఫిబ్రవరి 28 న ఆయన రాం రాం అంటూ కన్ను మూశాడు. దేశ్ రత్న అని పిలువ బడిన ఆయనకు మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# చరిత్ర మరిచిన శంభాజీ మహారాజ్

భారతదేశం ఎన్నో కళలకు పుట్టినిల్లు. సువిశాలమైన ప్రకృతి వనరులకు చక్కటి ఉదాహరణ భరతభూమి. నిశితంగా పరిశీలిస్తే భరతభూమి లో ప్రతి ఒకదానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకత శాశ్వతమైన ఘనకీర్తి గా ఎల్లప్పుడూ వెలుగుతూనే ఉంటుంది. అలాంటి ప్రత్యేకతలో ఒకటి హైందవ సనాతన ధర్మం ప్రధానమైనది. భరతభూమి లో హైందవ వీరులలో అతి ప్రధానమైన వారు ఛత్రపతి శివాజీ మహారాజ్ ముఖ్యమైన వారు.






హిందూ రాజ్యాస్థాపన లక్ష్యంగా తన పోరాటం సాగించిన శివాజీ మహారాజ్ నాటి మొగల్ పాలకుడు ఔరంగజేబుకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. గెరిల్లా వ్యూహాలతో మొగల్ సైన్యాలను మట్టి కరిపించిన శివాజీ 1674లో రాయగడ్ కోటలో మరాఠా సామ్రాజ్యానికి అధినేతగా ఛత్రపతి బిరుదుతో పట్టాభిశక్తుడయ్యాడు. కేవలం హిందుత్వమే కాదు న్యాయమైన పరిపాలన, సంక్షేమం ,సమర్థవంతమైన పనులపై శివాజీ దృష్టి పెట్టేవారు.తన దేశభక్తి ,ధైర్యం నాయకత్వంతో తరతరాలకు ప్రేరణగా నిలిచారు.తన ధైర్యసాహసాలతో భారత చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని శివాజీ లెక్కించుకున్నారు. అయితే ఛత్రపతి శివాజీ అకాల మరణంతో మరాఠా సింహాసనాన్ని ఆయన పెద్ద కుమారుడు శంభాజీ చేపట్టి తొమ్మిది ఏళ్ల పాటు రాజ్యాన్ని కాపాడుతూ వచ్చాడు. ఒకవైపు రాజ్యంలో అస్థిర పరిస్థితులను చక్కదిద్దుతూ ఇంకోవైపు మొగల్ పాలకులతో తన తండ్రి శివాజీ లాగే పోరాటం సాగించాడు . శంభాజీ రాజు 1681 నుంచి 1689 వరకు మరాఠా రాజ్యాన్ని పరిపాలించారు. 1657 మే 14న శివాజీ, సాయిబులకు మొదటి సంతానంగా జన్మించిన శంభాజీ రెండేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయారు..ఆయన బాల్యమంతా శివాజీ తల్లి జిజీయాబాయి దగ్గర గడిచింది. పిలాజీ షిర్కే కుమార్తె జీవుబాయిని శంభాజీ వివాహం చేసుకున్నారు. తరువాత కాలంలో ఆమే యేసుబాయిగా పేరు మార్చుకున్నారు.శంభాజీ పరిపాలన సమయంలో అనేక సైనిక దాడులకు శంభాజీ నాయకత్వం వహించారు.అందులో ముఖ్యమైంది మొఘల్ పాలనలోని బుర్హాన్‌పూర్‌పై దాడి. నాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌ను జయించాలనే ప్రయత్నానికి శంభాజీ అడుగడుగునా అడ్డుపడ్డారు. మరాఠా రాజ్యాన్ని కాపాడుకోడానికి 1682 నుంచి 1688 వరకు అనేక పోరాటాలు సాగించారు. శంభాజీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే తన హత్యకు కుట్రలు చేస్తోన్న వ్యక్తులను గుర్తించారు. అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించి, తన తండ్రి స్థాపించిన హిందూ స్వరాజ్యాన్ని రక్షించారు.కానీ, 1689లో శంభాజీని ఔరంగజేబు బంధించి, రోజుల తరబడి చిత్రహింసలకు గురిచేశారు. అత్యంత దారుణంగా 1689 మార్చి 11న శంభాజీని ఉరితీశారు. అయితే, మరణం కళ్ల ముందు ఉన్నప్పటికీ ఆయన భయపడలేదు. మతం మారితే వదిలేస్తానన్న ఔరంగజేబు ప్రతిపాదనను తిరస్కరించిన ఆయన.. హిందూ ధర్మం కోసం ప్రాణాలు వదలడానికే మొగ్గు చూపారు. శంభాజీ ధైర్యమే మరాఠాల హృదయాల్లో ఆయనకు శాశ్వతమైన స్థానాన్ని సంపాదించి పెట్టింది. శంభాజీ మహారాజ్ ధైర్యం, జ్ఞానం, సవాళ్లను ఎదుర్కొని నిలబడిన విధానం నేటి తరానికి పట్టుదల, దేశభక్తికి అమూల్యమైన పాఠాలను నేర్పుతాయి. అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ఆయన నిర్భయంగా, దృఢ సంకల్పంతో ఉండేవాడు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా వెనక్కి తగ్గొద్దని చాటారు.

ఇక, శంభాజీ ఓ పరిశోధకుడు కూడా. రాజ్యాన్ని కాపాడుకోవడానికి ఓవైపు అలుపెరగని పోరాటం చేస్తూనే.. మరోవైపు పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. విద్య, విజ్ఞానానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన యుద్ధ వ్యూహాలు, నాయకత్వం నుంచి చాలా నేర్చుకోవచ్చు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి.. ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం, వారిపట్ల ఆయన చూపిన విధేయత అనిర్వచనీయం.

అన్నింటికీ మించి ఆయన దృఢ సంకల్పం, క్రమశిక్షణ, స్వావలంబన.. నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. నిజమైన బలం కేవలం అధికారంలో కాదు, వ్యక్తిత్వం, పట్టుదలలో ఉందని ఆయన జీవితం తెలియజేస్తుంది. యుద్ధ విద్యాలలో ఆరితేరిన 5 లక్షల సైన్యం, అపారమైన ఆర్థిక సంపద కలిగి ఆ రోజుల్లో ఆసియా ఖండంలో అతి పెద్ద రాజు అయిన ఔరంగజేబు కు 27 సంవత్సరాల పాటు ముచ్చెమటలు పట్టించిన ధీరుడు శంభాజీ మహారాజ్. 9 ఏళ్ల పాటు 107 యుద్ధాలు చేసి విజయ దుందుభి మెగించిన హైందవనిష్టాపరుడు. 40 రోజులు పాటు ఔరంగజేబు తన నియంతృత్వ పోకడాలతో ఎన్ని రకాలుగా చిత్రహింసలకు గురి చేసిన మతం మరని హిందూ ధర్మ పరిరక్షకుడు. తన ప్రాణం పోయేంత వరకు హిందూ ధర్మ స్థాపనకు, పరిరక్షణకు శ్రమించిన హైందవ వీరుడు శంభాజీ మహారాజ్ నేటి తరానికి ఆదర్శనీయం. ప్రస్తుత సమాజానికి ఆ మహావీరుడి జీవిత చరిత్రను ఛావా చిత్రం తో ముందు పెట్టడం చాలా శు భపరిణామం.

**వంశీకృష్ణ గౌడ్ బండి**
**రంగయ్యపల్లి,రేగొండ జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**9550837962**



## ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న
# అరుదైన వ్యాధులు

**(28 ఫిబ్రవరి "అరుదైన వ్యాధుల దినం" సందర్భంగా)**

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం మహమ్మారి తరహా వ్యాధులను అరుదైన వ్యాధులు లేదా రేర్ డిసీజెస్ అని పిలుస్తారు. ప్రతి పది వేల మందిలో దాదాపు పది వరకు అరుదైన వ్యాధులతో బాధ పడుతున్నట్లు గమనించారు. అరుదైన వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఫిబ్రవరి చివరి రోజున అనగా 28 ఫిబ్రవరి 2025న నిర్వహించడం జరుగుతున్నది. అరుగైన వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పించడంతో పాటు వాటి నిర్ధారణ, చికిత్సల గూర్చి చర్చించడం జరుగుతుంది.అరుదైన వ్యాధుల దినాన్ని వందకు పైగా దేశాలు నిర్వహిస్తూ వాటి పట్ల అవగాహనలు, పరిశోధనలు, నిర్ధారణలు, చికిత్సలు, పాలసీ నిర్ణయాలు చేయడం కొనసాగుతుంది. అధిక అరుదైన రోగాలకు సరైన చికిత్సలు లేవు. రోగ లక్షణాలను బట్టి ఉపశమన చికిత్సలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అరుదైన వ్యాధులు:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 6000 అరుదైన వ్యాధులు ఉన్నాయి. దాదాపు 300 మిలియన్ల అరుదైన వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ఈ వ్యాధిల్లో 72 శాతం వరకు క్రోమోజోములకు సంబంధించినవని తెలుస్తుంది. అరుదైన వ్యాధుల జాబితాలో నాడీ, నాడీ కండర, జీర్ణక్రియ, క్రోమోజోమ్, చర్మ, ఎముకల, అస్థిపంజర, గుండె, రక్తం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, ఇతర శరీర అవయవాలు లేదా వాటి వ్యవస్థలను ప్రభావితం చేసే రోగాలను వస్తాయి. అరుదైన వ్యాధులకు సూచనగా గులాబీ, ఆకుపచ్చ, నీలం రంగుల బ్యాడ్జిలు లేదా లైట్లు ఉపయోగిస్తారు. భారత్‌కు సంబంధించిన స్వచ్ఛంద సంస్థ అధ్యయనం ప్రకారం ఇండియాలో దాదాపు 263 అరుదైన రోగాలు ఉన్నాయని, ఏడాదికి కనీసం 5,000 మంది వీటి బారిన పడుతున్నారని తేలింది. ముఖ్యమైన అరుదైన వ్యాధుల్లో అకాంతోసైటోసిస్ కొరియా, అచలేసియా కార్డియా, ఆక్రోమెసోమెల్క్ డిస్ప్లాజియా, అక్యూట్ ఇన్‌ఫ్లమేటరీ పాలీన్యూరోపతి, లుకేమియా, అడిసన్, ఏఎల్డీ, అలజిల్లే సిండ్రోమ్, బ్లాక్ యూరియా వ్యాధులు వస్తాయి.

అరుదైన వ్యాధుల దినం-2025 ఇతివృత్తం:

2025 అరుదైన వ్యాధుల ఇతివృత్తంగా "మోర్ ద్యాన్ యు కెన్ ఇమాజిన్ : ఆన్ ఆంథాలజీ ఆఫ్ రేర్ ఎక్స్‌పీరియన్స్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. అరుదైన వ్యాధిగ్రస్తులకు ధైర్యాన్ని ఇవ్వడం, వారికి అవసర సహాయం చేయడం, వ్యాధుల గూర్చి పరిశోధనలు చేయడం, కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించడం లాంటివి చేయవచ్చు. అరుదైన వ్యాధిగ్రస్తుల అనుభవాలను ఆన్‌లైన్ వేదికలుగా వివరించడం, వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడం లాంటివి చేయడం జరుగుతోంది.

పూర్తిగా అవగాహన లేని, అపార్థం చేసుకున్న అరుదైన వ్యాధులతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పుట్టుకతో వచ్చే ఈ వ్యాధులకు తగు చికిత్సలు లేనందున జాగ్రత్తగా ఉండడం మాత్రమే మన చేతుల్లో, చేతల్లో ఉన్నదని గమనించాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037